# పిచ్చితల్లి

ఆ వీథిలో కొందరి పెదవులమీద ఒక వంకర నవ్వు చిందులు త్రొక్కుతోంది. వాళ్లు కసితీరినట్లు వాళ్ళముఖాలు విప్పారి వెలుగుతున్నాయి.

నిజానికి ఆవీథంతా చిన్నబోయింది. లలిత వాళ్ల ఇల్లు చీకటిగూడులా ఉంది. లలిత తండ్రి కండువాను ముసుగుగా కప్పుకొని కూర్చున్నాడు గదిలో. కత్తివేటు వేసినా నెత్తురుచుక్క లేకుండా అయిపోయింది ఆయన ముఖం.

ఒక్క క్షణంలో శరీరంలోని ప్రాణశక్తి నంతనూ గుంజే భయంకరవ్యాధి ఏదో ఆదంపతులిద్దరికీ సోకి తనపనిని పూర్తిచేసుకొన్నట్లుంది

ఆ దంపతులు నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తూ దుఃఖాన్ని అదుపులో ఉంచుకోడానికి బ్రహ్మప్రయత్నం చేస్తున్నారు. కాని అప్పుడప్పుడూ పెద్దగా ఏడ్వకుండా ఉండలేక పోతోంది లలిత తల్లి.

వాళ్ళకళ్ళు ఎర్రగాఅయి, వాళ్ళగొంతులు బొంగురుపోయి చివరకు వాళ్ళు శోషపోయినట్లు ఆరోజల్లా అలాగే పడిఉన్నారు.

మర్రోజు ఉదయమే లలితతల్లి తూలుతూ లేచి.

"తల్లీ ఎంతపని, చేశావమ్మా, అయ్యో, పిచ్చితల్లీ!" అని నెమ్మదిగా అంటూ వెక్కి వెక్కి ఏడుస్తూ పోలుతూ కుంపటి రాజేసి ఇంత కాఫీ కాచి భర్తదగ్గరకు తీసికెళ్లి బ్రతిమాలాడటం మొదలుపెట్టింది గద్గదస్వరంతో.

"లేచి కొంచెం ఈ కాఫీ తీసుకోండి" అంటూ.

లలిత తండ్రి నిన్నటికీ ఇవాళ్టికీ చిత్రంగా మారిపోయాడు. ఆయనను నిన్నంతా పీడించిన క్షోభా దుఃఖమూ పూర్తిగా మార్చి వేశాయి. ఇప్పుడు ఆయన కళ్లలో కన్నీరు లేదు; గొంతులో గాద్గద్యం లేదు; హృదయంలో ఆర్ద్రత లేదు.

"లలిత నాకడుపున పుట్టనే లేదనుకుంటున్నా— పుట్టినా ఏనాడో చచ్చిపోయిందనుకుంటున్నా— ఇక దానిప్రసక్తి తేవద్దు" అన్నాడు.

కాఠిన్యాన్నీ, విరక్తినీ ధ్వనింప చెయ్యటానికి సర్వశక్తినీ ప్రయోగిస్తున్నట్లు కనబడ్డాడు. కాని, సఫలుడు కాలేకపోయాడు.

లలితతల్లి ఆ మాటలు వినలేకపోయింది. ఆమె దుఃఖం కట్టలు తెంచుకుంది. భోరున ఏడుస్తూ అంది:

"అలాంటి మాటలు అనకండి, నేను వినలేను. రత్నంలాంటిపిల్ల, ఎంత తెలిపితక్కువ పని చేసింది!"

"పరువూ ప్రతిష్ఠా మంట కలిసిపోయాక ఈ బ్రతుకు ఇక ఎందుకూ?" కోపంతో శరీరం వణికిపోతుండగా గాలితో అరిచినట్లు అన్నాడు.

"అయ్యో, తల్లీ!" పెద్ద నిశ్వాసంతో లలిత తల్లి కంపించిపోయింది.

"నాకు బ్రతకాలని లేదు—ఎవరికోసం బ్రతకడం, లలిత మనబిడ్డ కాకపోయాక? ఏ ముఖం పెట్టుకొని నలుగురిలో తల ఎత్తుకొని తిరగగలను?" స్త్రీలా భోరున ఏడ్చాడు.

"దూరం ఆలోచించ గలిగితే ఇలా చెయ్యనే చెయ్యరు. మన లలిత మనకు తెలియనిదా చెప్పండి?" అతిదీనంగా రాళ్లు కరిగేలా జాలిగొల్పే కంఠంతో అనునయిస్తూ అంది.

## చక్రవర్తి రంగస్వామి

ఎక్కడోవున్న లలిత తండ్రికళ్ళకు కట్టినట్లు కనిపించింది, సుపరిచితమైన సద్గుణాలో, వినయం, భక్తి, ప్రేమ, సహజ సౌకుమార్యమూ మూర్తీభవించి ఉన్నాయి. విషాదమూ, నిరాశా ఆవరించి ఉన్నాయి

తల్లిదండ్రులమీదిభక్తి, భయమూ, సానుభూతీ ఆ పెద్ద కళ్లలో కన్పిస్తూ ఉన్నాయి.

ఆయన హృదయం తరుక్కుపోయింది. "అమ్మా లలితా, అమ్మా, అమ్మా" అని పెద్దగా పిలిచాడు కన్నీరుతో—పసిపిల్లవాడిలా, అతి వృద్ధుడిలా, గుండె పగిలిపోయేలా.

"ఈ కాలపు పిల్లలలో కనిపించే ఏ చిన్నలోపంకూడా నా తల్లిలో లేదే! ఈ దుర్ఘటన మనకర్మం అనుకోవాలి" అనుకుంటూ కళ్లుతుడుచుకుంటున్నాడు. కన్నీరు తరగటంలేదు.

తల్లి మనస్సు లలితయెడల—అసలు—కఠినం కానేలేదు. అసలు తనబిడ్డ తప్పుచేసి ఉండదనే ఆమె నమ్మకం. తనబిడ్డ ఎక్కడున్నా నీతిగా నిజాయితీగా బ్రతకగలదనే ఆ తల్లి ధీమా. లలిత వివాహసమస్య పరిష్కరింపరానిది కావటంతో సంఘనియమాలంటే ప్రత్యేక ద్వేషభావమేమీ లేని ఆమెకు సంఘంమీద అసహ్యం ప్రారంభమైంది. ఇప్పుడా అసహ్యం అవధులుదాటి లలిత మీద పొంగిపొర్లిన మాతృప్రేమతోబాటు లలిత తప్పుపనిచేసివున్నా క్షమించగలిగినంత దయతో ఆమె హృదయం తొణికిసలాడుతోంది. భర్తహృదయం ఒకసారి సంఘంవేపూ, ఒకసారి బిడ్డవేపూ దుర్బలంగా ఉయ్యాల ఊగుతున్నా, ఆమె—కట్నాల దురాచారానికి బలైపోయిన తన బిడ్డవేపే అచంచలంగా నిలబడిఉంది. కాని, తనబిడ్డ ఏది?

## 2

లలిత పెళ్లిసమస్య తలఎత్తి తల్లిదండ్రులను పీడించటం ప్రారంభించింది. తల్లిదండ్రులిద్దరూ ఒకచోట కూర్చున్నప్పుడు ఆలోచించేది తన పెళ్లినిగురించే అని లలితకు తెలుసు. తన పెళ్లిసమస్యను చక్కగా పరిష్కరించడానికి కావలసిన ఆర్థికస్తోమతు వాళ్లకులేదు. సరైన సంపాదనా, వయోరూపగుణాలూ కొరతపడ్డ ఏ వరునికీ ఎరగి యొరిగి తనను ఇవ్వడానికి తల్లిదండ్రులు ఒప్పుకోరు. తక్కువకట్నంతో దొరికే వరుడు తన కుటుంబాన్ని పోషించుకోలేని వాడుగా ఉంటాడనీ, అలాంటివాడిచేతిలో తమబిడ్డను పెట్టడం గొంతు నులమటమే అవుతుందనీ తన తల్లిదండ్రుల అభిప్రాయమని ఆమెకు తెలిసిపోయింది.

తన పెళ్లి వాళ్ల ప్రాణాలనుకృంగతీసే ఇంత గడ్డు సమస్యగా పరిణమించడం లలితకు చాలాభయాన్ని కలిగించింది.

చిన్నతనం నుంచి కలకల లాడుతూ, చిలకలా పాడుతూ, హంసలా కులుకుతూ వుండే లలితకు దిగులుపట్టుకుంది. రోజులు సుఖంగా గడవటంలేదు మనస్సుకు ఉత్సాహం లేదు. చెయ్యవలసిన పనిలేదు ఎక్కడికీ వెళ్ళటం, రావటం లేదు. స్నేహాలు లేవు.

ఎటుచూచినా ప్రపంచం తనను ఎందుకో పరీక్షిస్తున్నట్లు, వంక పెట్టడానికి సమయం కోసం చూస్తున్నట్లు కనపడేది తనను బురదలోకి లాగటానికి ప్రయత్నిస్తున్నట్లు కనపడేది.

తను అలంకరించుకోకపోయినా స్త్రీత్వం ప్రసాదిస్తున్న అందచందాలు రూపురేఖలను తీర్చి దిద్దుతున్నట్లు అనిపించేది. కాలం గడుస్తున్న కొద్దీ తనలో ఏదో క్రొత్తదనం,

వికాసం, పరిమళం ఏర్పడుతున్నట్లు తోచి తనవేపు తాను చిత్రంగా చూచుకొనేది.

ఏపనీలేని లలితకు ఎన్నో చిత్రమైన ఆలోచనలు, కోరికలు, ఆశలు మొలకలెత్తేవి. ఒక్కసారిగా మళ్ళీ నిరాశా, విచారమూ, తల్లిదండ్రులమీది జాలీ నల్లని మేఘాలుగా ఆమె మెదడును ముసురుకొనేవి.

ఒకసారి యౌవనం తెస్తున్న ఆశలూ, కోరికలూ నిండిన తిన్నని వెన్నెలబాటా, ఒకసారి దారిద్ర్య భీతీ, నిరాశా తెచ్చే చీకటులు అలముకొంటున్న అంతులేని వంకరల బాటా ఆమెకళ్ళకు లీలగా కనిపిస్తూ ఉండటం అలవాటైపోయింది.

## 3

లలిత తండ్రి దుర్బలంగా క్రుంగిపోతున్నాడు. "పేరు ప్రతిష్ఠలు" అంటాడు. "మానాభిమానాలు" అంటాడు. "బ్రతుకు నవ్వులపాలై పోయిం"దంటాడు. తాను బ్రతకటం ఎందుకని ప్రశ్నించుకొంటాడు. సంఘం తనను చచ్చిపోనివ్వనట్లు విసుక్కుంటాడు—తాను బ్రతకటం చచ్చిపోవటం సంఘం చేతిలో ఉన్నట్లు! తన చేతిలో లేనట్లు!!

ఆయన ఆత్మీయమైన అమూల్య పదార్థాన్ని పోగొట్టుకొన్నట్లు, ఐహిక సర్వస్వాన్ని పోగొట్టుకొన్నట్లు పిచ్చివాడై పోయాడు. ప్రాణాధారమైన ముఖ్య రక్తనాళమేదో బ్రద్దలైపోయి విలవిల బాధపడిపోతున్న ప్రాణిలా ఉన్నాడు.

కాలచక్రం మామూలుగా తిరుగుతూన్నా లలిత తల్లి దండ్రులు అటు చూడటంలేదు.

ఒకరోజు పోస్టు బంట్రోతు వచ్చాడు. అతని చేతిలోవున్న కవరుమీద ముత్యాలలాంటి లలిత దస్తూరి మెరసిపోతోంది.

లలిత తల్లి తీసుకుంది. కవరు చించి జాబును తీసి చదవటం మొదలుపెట్టి ఒక్క క్షణంలో పూర్తిచేసి సంతోషంతో విప్పారిన ముఖంతో, ఆనందం నిండిన కంఠంతో అంది జాబును భర్తకు అందిస్తూ.

"లలితా, వాళ్ళ దామూ వివాహం చేసుకున్నారుట, చూడండి."

చేతులు వెనక్కిపెట్టి పచారుచేస్తూఉన్న ఆయన విషాదమౌనాన్ని భంగపరచలేదు.

"మీ దంతా వట్టి పిచ్చి! ముందు ఈ జాబును చదవండి-తరువాత ఆలోచిద్దురు కాని" అంది చిరునవ్వుతో.

"ఏమిటేంటి?" అన్నాడు మెత్తపడుతూ.

"చెప్పటం కాదుగానీ, జాబు చదువనా?" అంటూ చదివింది-మాతృప్రేమ, పత్నీస్నేహం, మహదానందం మూడూ కలిసినప్పటి మాధుర్యం కంఠధ్వనిని పొంగుతూ ఉండగా.

"......లలిత నమస్కరించి వ్రాయు విన్నపములు.

నన్ను అల్లారు ముద్దుగా పెంచిన మీకు నావల్ల సుఖమూ శాంతీ లేకుండాపోయే ప్రమాదం వచ్చి పడిందన్న భయం నన్ను ఆవరించింది. నా బాధనుండి మిమ్మల్ని విముక్తులను చేద్దామని-ఏ ఆంధ్ర మహిళా సభనో ఆశ్రయిద్దామని లేనిధైర్యం తెచ్చుకొని బయలుదేరాను. ఎలాగో రైలులో కూలబడ్డాను......

కన్నీళ్ళతో దూరంగా వెళ్ళిపోయే బిడ్డనే కాకుండా, బిడ్డను పోగొట్టుకొన్న దుఃఖంలో మునిగివుండే తల్లిదండ్రులను కూడా సమాజం క్రూరంగా వేలుపెట్టి వెక్కిరిస్తుందని నాకు తెలియకపోలేదు! ఈ ప్రపంచం ఏదైనా చెడ్డమాట-మీ బిడ్డను అంటే-అందులో ఏమీ న్యాయంలేదనీ, మీబిడ్డ మీకు కళంకం తెచ్చేవిధంగా ప్రవర్తించలేదనీ ప్రమాణంచేసి చెపుతున్నాను.

కట్నం ఒకపక్షానికి స్వార్థ సంబంధమైనదీ రెండవపక్షానికి ప్రాణావసరమైనదీ అయింది. ఈ దురాచారం పోవాలంటే ముఖ్యంగా వధూవరులలోనూ, వాళ్ళ పెద్దలలోనూ పరివర్తనం రావాలి...

అదృష్టవశాత్తు రైలులో మామయ్యగారి 'దామూ' కనపడ్డారు. నన్ను అనేక ప్రశ్నలువేసి నాపరిస్థితిని తెలుసుకున్నారు. నాయందు సానుభూతికలిగి నన్ను వివాహమాడతానని చెప్పి, పెద్దలవల్ల ఏ ఆటంకమూ కలగకుండా ఉండటానికై-వెంటనే నన్ను వివాహమాడారు సాహసించి.

మీ ఆశీస్సులూ, దయా మాకు శ్రీ రామరక్షగా నిలుస్తాయని మాకు తెలుసు.

నేనూ, మీ అల్లుడుగారూ రేపు రాత్రి బండిలో వస్తున్నాము.

మీ చిట్టి తల్లి,
లలిత."

ఈ జాబును వింటూండగా ఆయన ముఖంలోకి జీవకళా, శరీరంలోకి ప్రాణశక్తి ప్రవేశించాయి.

నవ్వుముఖంతో "పిచ్చి తల్లి ఎంతపని చేసింది!" అని ఆశ్చర్యంతో సగం నోరు తెరచి భార్య కళ్ళలోకి చూస్తూ ఉండిపోయాడు.

* * *

మర్రోజు లలితా వాళ్ళ ఇల్లు కలకలలాడుతూ ఆవీధికంతకూ ఎంతో శోభను తెచ్చింది. కారణం, లలితా, దామూ రాత్రి బండిలో వచ్చారు. ఆ నూతన దంపతులు ఆయింటికి వింత శోభను వెంటపెట్టుకొని తెచ్చారు. లలిత తల్లిదండ్రులు ఆనందాతిశయంతో ఏపని చెయ్యటానికీ తోచక కూతురివేపూ, అల్లుడివేపూ విచిత్రంగా చూస్తూ ఉండిపోయారు.

ఆవీధిలోని కుత్సితుల ముఖాలమీద నల్లని నీడ వ్రేలాడింది. ★



ఎక్కౌంటు పుస్తకాలు
తయారుచేయువారికి
బుక్ బైండర్సుకు-ప్రింటర్సుకు,

ది స్టాండర్డ్ మిల్స్ కో. లిమిటెడ్. న్యూ ప్రభాదేవి రోడ్, బొంబాయి 28.

SM-6-5-TEL.